సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024





## సంఘీభావం తెలిపి..

కైలాస్‌నగర్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె 14వ రోజుకు చేరింది. శిబిరాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి సందర్శించి రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు.



## ముగిసిన సప్తాహం

బేల మండలం దహెగాం గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న బాజీరావు బాబా సప్తాహం ముగింపు వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. 9లో▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/16.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### మున్సిపల్ కార్మికుల నిరసన



నినాదాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కైలాస్‌నగర్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్‌లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల నుంచి వేకువజామున నాలుగు గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకోవాల్సి ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి వెంటనే ప్రభుత్వ భూమి కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు కట్టించిఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిరంజీవి, కాంతారావ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### కుష్ఠు నివారణకు ప్రత్యేక చర్యలు

ఇచ్చోడ: కుష్ఠు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కుష్ఠు నివారణ అధికారి సాగర్ అన్నారు. మండలంలోని నర్సాపూర్, ఇచ్చోడ పీహెచ్‌సీలను సోమవారం సందర్శించారు. రోగులు, సిబ్బందితో మాట్లాడారు. కుష్ఠు లక్షణాలు కనిపించిన వెంటనే ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు గుర్తించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలన్నారు. నిర్ధారణ అయితే చికిత్స అందేలా చొరవ చూపాలన్నారు. కుష్ఠు ప్రాణాంతక వ్యాధి కాదని మందులతో పూర్తిగా నయమవుతుందన్నారు. ఆయన వెంట డీఎంపీవో వాముస్, రమేశ్‌తో పాటు ఆయా పీహెచ్‌సీల సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

### అన్నదాతను అన్ని విధాలా ఆదుకోవాలి



రైతును సన్మానిస్తున్న బొర్రన్న

తలమడుగు: అన్నదాతను ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండలంలోని బరంపూర్ గ్రామంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఉత్తమ రైతులను శాలువా కప్పి సన్మానించారు. దేశానికి వెన్నెముక అయిన రైతన్నను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. ఇందులో రైతులు తదితరులున్నారు.



జిల్లా కేంద్రంలోని రణదీవెనగర్ లేఅవుట్ స్థలం

లేఅవుట్ ప్లాన్

ప్లాట్ ఈసీలో లింక్ డాక్యుమెంట్ వివరాలు లేని పత్రం

# పైసలిస్తే.. సై!

- అనధికారిక లేఅవుట్‌లోనూ రిజిస్ట్రేషన్లు
- ఆదిలాబాద్ ఎస్‌ఆర్‌వోలో నిర్వాకం
- సామాన్యులకు మాత్రం నిబంధనల సాకు!
- డాక్యుమెంట్ చేసేందుకు ససేమిరా

సాక్షి,ఆదిలాబాద్: ఓ సామాన్యుడు ఓ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఆ ప్లాట్ అనధికారిక లేఅవుట్‌లో ఉన్న పక్షంలో.. ప్రభుత్వ సర్క్యులర్ జీవో నం.257 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయడం కుదరదంటూ అధికారులు చెబుతారు. డీటీసీపీ, ఎల్‌ఆర్‌ఎస్ ఉన్న ప్లాట్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తామని అంటారు. ఒకవేళ గతంలో ఆ ప్లాట్ రిజిస్ట్రేషన్ అయి ఉంటే లింక్ డాక్యుమెంట్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేస్తామంటూ నిబంధనలు వల్లే వేస్తారు. జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ శివారు రణదీవెనగర్‌లోని సర్వేనంబర్ 59/1, 59/1/2/1/2/, 59/1/2/2 పరిధిలో కొన్ని ఎకరాల స్థలంలో ఇటీవల వెంచర్ చేశారు. ఇందులో 109 నంబర్ గల ప్లాట్‌ను గత నవంబర్ 7న ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ అయ్యింది. అయితే దీనికి డీటీసీపీ అనుమతి లేదు. అనధికారిక లేఅవుట్. వేకెంట్ ల్యాండ్ అసిస్మెంట్ కింద మున్సిపాలిటీ చార్జీలు వసూలు చేసింది. లింక్ డాక్యుమెంట్ లేదు. రిజిస్ట్రేషన్ మాత్రం పూర్తయింది. సామాన్యులు వెళితే నిబంధనలు వల్లే వేసే సబ్‌రిజిస్ట్రార్లు ఈ ప్లాట్‌కు మాత్రం ఎలా రిజిస్ట్రేషన్ చేశారో అనేది అందరిలో తలెత్తే ప్రశ్న. ఇలా ఈ అనధికారిక లేఅవుట్‌లో ఇటీవల కొన్ని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చకచకా జరుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**తిరకాసు పెట్టడంలో దిట్ట..**

ఆదిలాబాద్ ఎస్‌ఆర్‌వోలో ఓ సబ్‌రిజిస్ట్రార్ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ పరంగా తిరకాసు పెడుతూ జనం నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే అనధికారిక లేఅవుట్లలో రిజిస్ట్రేషన్ల విషయమై ఎవరైనా ఆ అధికారిని కలిసినప్పుడు.. తన రూట్‌లోకి రాని పక్షంలో తాను ఈ రిజిస్ట్రేషన్ చేయనని, ఈ విషయంలో మీరు పైఅధికారులు ఎవరికైనా ఫిర్యాదు చేసుకోండి అంటూ పూర్తిగా తాను నిబంధనలకు లోబడి పనిచేస్తున్నట్లు బిల్డప్ ఇస్తారని ప్రచారంలో ఉంది. ఆమ్యామ్యాలు ఇస్తే మాత్రం అది అనధికారిక లేఅవుట్‌లో ఉన్న ప్లాట్ అయినా రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది.

ఆదిలాబాద్ పట్టణంలో అనేక అనధికారిక లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో పలు ప్లాట్లకు లింక్ డాక్యుమెంట్లు లేకపోవడంతో కొన్నేళ్లుగా రిజిస్ట్రేషన్లు చేయడం లేదు.అయితే రణదీవెనగర్‌లో

### రూ.50 వేలు ఇస్తే ఓకేనట..!

ఈ అనధికారిక లేఅవుట్‌లో మాత్రం ఓ సబ్ రిజిస్ట్రార్ అక్రమాలకు తెర లేపాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ.50వేలు చేయి తడిపితేనే సై అంటున్నారనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా అనధికారిక లేఅవుట్లలో కొద్ది నెలలుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ సబ్‌రిజిస్ట్రార్ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా రణదీవెనగర్ లేఅవుట్‌ను తన అక్రమాల కోసం తెర లేపారనే ప్రచారం సాగుతుంది. ప్లాట్‌కు రూ.50వేలు వసూలు చేస్తున్న ఆ అధికారి ఈ అనధికారిక లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్లు సక్సెస్ అయితే మిగతా ఇటువంటి లేఅవుట్లలో ఇలాగే అక్రమంగా సొమ్ము వసూలు చేసి రిజిస్ట్రేషన్లు చేయడానికి ప్లాన్ వేశారని మార్కెట్లో ప్రచారం నడుస్తోంది.

### లింక్ డాక్యుమెంట్ ఉన్నవి చేస్తున్నాం..



రణదీవెనగర్‌లోని లేఅవుట్‌లో లింక్ డాక్యుమెంట్ ఉన్నవి రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. ఈ లేఅవుట్ కొత్తది అనేది నాకు తెలియదు. కొన్నింటి విషయంలో కోర్టు ఆర్డర్ ప్రకారం వెళ్తున్నాం.

– విజయ్‌కాంత్, సబ్‌రిజిస్ట్రార్, ఆదిలాబాద్

# ‘మీన’మేషాలు!

- ఈ ఏడాది చేప పిల్లల లక్ష్యం సగమే
- టెండర్ ప్రక్రియ సైతం ఆలస్యమే..
- చెరువుల్లోనూ సకాలంలో విడుదల చేయని వైనం
- ప్రతికూల వాతావరణంతో ఎదుగుదలపై ప్రభావం
- ఆందోళనలో మత్స్యకారులు



| జిల్లాలో.. |
|---|
| మత్స్యకారుల సంఘాలు : 101 |
| ఆయా సంఘాల్లోని సభ్యులు: 4800 మంది |
| మొత్తం చెరువులు: 240 |
| చేప పిల్లలు వదిలిన చెరువులు: 126 |
| చేప పిల్లల పంపిణీ లక్ష్యం: 87 లక్షలు |
| ఈ ఏడాది చెరువుల్లో వదిలింది :43.42లక్షలు |

ఆదిలాబాద్‌టౌన్: చేప.. చేప.. నువ్వెందుకు ఎండలేదు అన్న సామెతకు ఏవేవో కారణాలు చెప్పి, అసలు సంగతిని అటకెక్కించేస్తారు.. అయితే అదో సరదా కథ. కానీ ఇక్కడ మత్స్య శాఖకూ వర్తిస్తోంది. తప్పెవరిదో గాని మత్స్యకారులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. చెరువుల్లో సకాలంలో చేప పిల్లలను వదలకపోవడంతో వాతావరణ పరిస్థితుల కారణంగా అవి ఎదగడం లేదు. మార్చిలోనే విక్రయానికి రావాల్సిన చేపలు జూలై వరకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అప్పటివరకు చెరువుల్లో నీరు అడుగంటి చేపలు చనిపోయే అవకాశాలు ఉన్నాయి. ఎదుగుదల సరిగా లేక మత్స్యకారులకు ఏటా నష్టం వాటిల్లుతోంది. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై ఏటా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. అయితే ఈసారి నిర్దేశించిన లక్ష్యంలో సగం మాత్రమే చెరువుల్లో వదిలారు. దీంతో అవి కూడా సగం చెరువుల్లోనే వేయడంతో మిగతా చెరువులపై ఆధారపడిన మత్స్యకారులకు ఉపాధి కరువైంది. ఈ ఏడాది సమృద్ధిగా కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు జలసిరి సంతరించుకున్నప్పటికీ మత్స్య శాఖ నిర్లక్ష్యం పుణ్యమా అని మత్స్యకారులకు అవస్థలు తప్పడం లేదు.

**30 శాతం లోపే..**

జిల్లాలోని ఆయా రిజర్వాయర్, పెర్నియర్ ట్యాంకుల్లో 80 నుంచి 100 మి.మీ. సైజు గల కట్ల, రవు, మిరిగె రకాల చేపలను వదులుతారు. అలాగే చెరువుల్లో 35 నుంచి 45 మిల్లీ మీటర్ల కట్ల, రవు, బంగారు తీగ చేపలను వేస్తారు. ఇంతవరకు బాగానే ఉంది. జిల్లాలో దాదాపు కోటి వరకు చేపలను వదలాల్సి ఉండగా, ఈ ఏడాది 50 శాతం మాత్రమే విడుదల చేశారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 87లక్షల చేపలను వదలాల్సి ఉండగా, 43లక్షల 42వేల చేపలను వదిలినట్లు చెబుతున్నారు. జిల్లాలో 240 చెరువులు, కుంటలు, రిజర్వాయర్లకు గాను 126 వాటిలో మాత్రమే వేశారు. అయితే వివిధ కారణాలతో చేప పిల్లలు చనిపోవడంతో 30 శాతం వరకు మాత్రమే లక్ష్యం పూర్తయ్యిందని మత్స్యకారులు పేర్కొంటుండడం గమనార్హం.

**లోపిస్తున్న ఎదుగుదల..**

ఏటా మే నెలలో ప్రభుత్వం టెండర్లు వేస్తుంది. అయితే గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఈఏడాది అక్టోబర్‌లో ఈ ప్రక్రియ చేపట్టారు. రెండుసార్లు వాయిదా పడినప్పటికీ మూడోసారికి మోక్షం లభించింది. అదికూడా పూర్తిస్థాయిలో వేయకుండా 50 శాతం లక్ష్యం నిర్దేశించారు. అందులో కూడా పూర్తిస్థాయిలో చేప పిల్లలను వదలలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆగస్టులోనే వదిలితే అవి మార్చి నాటికి ఎదిగి విక్రయించేందుకు వస్తాయని మత్స్యకారులు చెబుతున్నారు. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్‌లో వదలడంతో వచ్చే ఏడాది జూన్, జూలై నాటికి చేపలు చేతికి వస్తాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో చేపలు ఎదగవని, ఆక్సిజన్ పూర్తిస్థాయిలో అందకపోవడంతో చనిపోతాయని అంటున్నారు. అలాగే గుర్రపుడెక్క పెరిగితే చేపలు పెరగడానికి ఆటంకం ఏర్పడుతుందని, ఈ క్రమంలోనే మార్కెటింగ్ ఆలస్యమవుతుందని అంటున్నారు. ప్రభుత్వం కట్ల, రవు, మిరిగె వంటి చేపలకు టెండర్‌లో రూ.1.76 పైసలు చెల్లించగా, చిన్న చేప పిల్లల కోసం 0.68పైసలు చెల్లించిందని అధికారులు చెబుతున్నారు. ఆగస్టులో చేప పిల్లలను వదిలితే అవి మార్చి నాటికి కిలో నుంచి రెండు కిలోల వరకు ఎదిగే అవకాశం ఉందని, ఆలస్యం కావడంతో 300 గ్రాముల నుంచి 500 గ్రాముల వరకు మాత్రమే పెరుగుతాయని చెబుతున్నారు. బరువు తగ్గడంతో దిగుబడి తగ్గి నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు.

### చేప పిల్లల కొనుగోళ్లకు డబ్బులు ఇవ్వాలి



ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను ఆలస్యం చేస్తుంది. దీంతో సకాలంలో చేప పిల్లలను చెరువుల్లో వదలడం లేదు. ఇది వాటి పెరుగుదలపై ప్రభావం చూపుతోంది. ఈ ఇబ్బంది తొలగాలంటే మత్స్యకారులకే చేప పిల్లలను కొనుగోలు చేసేందుకు డబ్బులు అందజేయాలి. మాకు నచ్చిన వాటిని కొనుగోలు చేసి చెరువుల్లో వేసుకుంటాం. అవసరమైతే మరికొన్ని డబ్బులు కూడా కలిపి పెంపకం చేపడతాం. ఆగస్టులో పంపిణీ చేయాల్సిన వాటిని నవంబర్‌లో వేశారు.

– మేకల అశోక్, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

### 50 శాతం వదిలాం

ఈసారి టెండర్ ప్రక్రియ కొంత ఆలస్యమైంది. ప్రభుత్వం 50 శాతం లక్ష్యం నిర్దేశించింది. జిల్లాలో 126 చెరువుల్లో 43లక్షల 42వేల చేప పిల్లలను వదిలాం. సాత్నాల ప్రాజెక్టులో 3.40లక్షల సీడ్‌ను సిద్ధం చేసి అందులో వదిలాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నాం.– మడావి చిత్రు, ఫీల్డ్ ఆఫీసర్

# కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

కైలాస్‌నగర్: వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్ 2న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వకముందే రాత పరీక్ష చేపట్టాలని నిర్ణయించడం సరికాదన్నారు. వెంటనే రాత పరీక్షను రద్దు చేసి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఇందులో వైద్య, ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి దూరం చేశారు



నా పేరు భౌరే అనిత. గుడిహత్నూర్ మండలంలోని సీతాగొంది గ్రామం. మా ఊరిలో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పదేళ్లుగా బ్యాంకు మిత్రగా పనిచేస్తున్నా. రూ.1500 వేతనం నుంచి పని చేస్తుండగా ఇప్పుడు రూ.5వేలు అయింది. అయితే బ్యాంకు అధికారులు, ఐకేపీ మండల సమాఖ్య సభ్యులు కుమ్మక్కై నన్ను ఇటీవల ఉద్యోగంలో నుంచి తొలగించారు. తొమ్మిది నెలల వేతనం కూడా చెల్లించలేదు. బ్యాంకుకు రానివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ కలెక్టర్ వద్ద కన్నీంటిపర్యంతమైంది. తిరిగి తనను ఉద్యోగంలోకి తీసుకుని ఉపాధి కల్పించాలని వేడుకుంది.

# వినతుల వెల్లువ



అర్జీ స్వీకరించి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- ఈ వారం గ్రీవెన్స్‌కు 104 దరఖాస్తులు

కైలాస్‌నగర్: ఈ వారం ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. ఏకంగా 104 అర్జీలు అందాయి. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి కలెక్టర్ రాజర్షి షా అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. సాధ్యాసాధ్యాల మేరకు పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు. కాగా భూ సమస్యలు, పింఛన్లు, స్వయం ఉపాధి, బ్యాంకు రుణాల మంజూరు వంటి సమస్యలపై ఈ వారం వందకు పైగా అర్జీలు అందాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో వినోద్‌కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కార్యదర్శి డిప్యూటేషన్ రద్దు చేయండి.**

నార్నూర్: మండలంలోని గుండాల గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్ రాజర్షిషాకు గ్రామస్తులు సోమవారం గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు.

### గుడ్డు ధర పెంచాలి



మేమంతా జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలకు కొడిగుడ్లను సరఫరా చేస్తున్నాం. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన టెండర్లలో ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చొప్పున చెల్లిస్తోంది. ఒక్కొక్కరం వారానికి 2లక్షల గుడ్లను సరఫరా చేస్తున్నాం. ప్రభుత్వం ఇటీవల కామన్ డైట్ మెనూ ప్రకటించింది. ఈ ప్రకారం వారానికి ఆరు రోజులు గుడ్లను అందించాలని సూచించింది. ప్రస్తుతం గుడ్డు ధర బహిరంగ మార్కెట్‌లో రూ.7కు చేరింది. రూ.5తో సరఫరా చేయడంతో ఇప్పటికే తాము తీవ్రంగా నష్టపోయాం. ఇదే ధరతో సరఫరా చేయాలంటే మరింత నష్టపోవాల్సి వస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా గుడ్డుధర పెంచేలా చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలి.

# జాయింట్ సర్వే నిర్వహించాలి

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాలో విద్యుత్ సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్ ఇచ్చేందుకు అటవీ, విద్యుత్‌శాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాయిపేట్-భీంపూర్, వాయిపేట-చిమన్‌గుడి, వాయిపేట-సూర్యాపేట, వాయిపేట్ ఆవాసాలకు సిరిచెల్మ ఫీడర్ చానల్ కోసం ఏబీసీ కేబుల్స్ వేసి సింగిల్ ఫేజ్‌ను 3-ఫేజ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. బాబ్జీపేట-గొండిగూడ, నేరడిగొండ-జి-కొలాంగూడ, నేరడిగొండ-బర్సిగుట్ట, నేరడిగొండ(జి)-ధర్మనపేట, నేరడిగొండ-నేరడిగొండ(కె) గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించేలా త్వరితగతిన జాయింట్ సర్వే నిర్వహించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఇందులో జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, విద్యుత్‌శాఖ అధికారి జేఆర్ చౌహాన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**స్థలాలను సేకరించాలి**

పట్టణంలో సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ (ఎస్‌టీపీ) నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలు త్వరితగతిన సేకరించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో కమిషనర్ సీవీఎన్.రాజు, డీఈలు తిరుపతి, అరుణ్‌కుమార్, ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లిష్

కైలాస్‌నగర్: జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లిష్ అమలు చేస్తామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ప్ర.ధానోపాధ్యాయులు, టీచర్లు 42 మందిని రిసోర్స్‌పర్సన్లుగా ఎంపిక చేసి వారితో సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ ఇవ్వాలని, అందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని డీఈవోను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ఇంగ్లిష్, సోషల్, మ్యాథ్స్, ఏపీఎస్ స్పోకెన్ ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. 1, 2 తరగతుల విద్యార్థులకు ఆంగ్లంలో చదవడం, రాయడంపై పట్టుసాధించేలా టీచర్లు సబ్జెక్టును బోధించాలన్నారు. ఇంగ్లిష్ ధారాళంగా మాట్లాడేలా టీచర్లు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం సంక్రాంతి తర్వాత ప్రారంభించనునట్లు తెలిపారు.

### రోడ్డు సౌకర్యం లేక తిప్పలైతంది..



సార్.. మేమంతా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అసోద బుర్కి గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులం. మా ఊరికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేక చానా ఇబ్బంది పడుతున్నాం. కనీసం బైక్ కూడా వెళ్లలేని పరిస్థితి. వానాకాలంలోనైతే ఇంద్రవెల్లి నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఏటా ఇవే తిప్పలు పడుతున్నాం. వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

### చేలకు వెళ్లే దారిని కబ్జా చేశారు



మాది తాంసి మండలంలోని పొన్నారి గ్రామం. మేమంతా రైతులం. సర్వే నంబర్ 228 , 229, 230, 231 లలో మా వ్యవసాయ భూములున్నాయి. అయితే వీటికి సమీపంలో ఓ రియల్టర్ లేఅవుట్ ఏర్పాటు చేశాడు. మేము చేన్లకు రాకపోకలు సాగించాల్సిన దారిని ఆక్రమించాడు. దీంతో దారి లేకుండా పోయింది. పత్తి పంట తీసే సమయం కావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దారి సౌకర్యం కల్పించేలా చూడాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాం.

### వేతనాలు చెల్లించడం లేదు.



మేమంతా ఈజీఎస్‌కు సంబంధించి మండల కంప్యూటర్ సెంటర్లలో ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికన అటెండర్లుగా పనిచేస్తున్నాం. 2010 నుంచి రూ.3వేల వేతనంతో విధులు నిర్వహిస్తున్నాం. ఇటీవల వేతనాన్ని రూ.5200కు పెంచారు. ఆరు నెలల క్రితం వరకు బ్యాంకు ఖాతాల్లోనే జమ చేశారు. ప్రస్తుతం మండల మహిళా సమాఖ్యల నుంచి తీసుకోవాలని చెబుతున్నారు. ఉదయం 8.30 నుంచి రాత్రి ఏడు గంటల వరకు పనిచేస్తున్న మాకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నా ఉద్యోగ భద్రత లభిస్తుందనే ఆశతో పనిచేస్తున్నాం. ఆరు నెలలుగా వేతనాలు చెల్లించట్లేదు. పెండింగ్ వేతనాల చెల్లింపుతోపాటు గతంలో మాదిరిగా ఖాతాల్లోనే వేతనం జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

# నేటి నుంచి వరంగల్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీస్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ నుంచి వరంగల్‌కు మంగళవారం నుంచి ప్రతి రోజు రాత్రి 9 గంటలకు ఎక్స్‌ప్రెస్ సర్వీస్ నడపనున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వీస్ ఉట్నూర్, లక్సెట్టిపేట, కరీంనగర్ మీదుగా ఉదయం 4 గంటలకు వరంగల్ చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో వరంగల్ నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.15 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటుందని వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రారంభించిన ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## క్లుప్తంగా

### ఇసుక లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీ

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు భీంపూర్ ఏఎస్సై ముంతాజ్ తెలిపారు. సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. అందులో దాదాపు రూ. 2 లక్షల విలువైన ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తనిఖీల్లో సిబ్బంది సుభాష్, ఆశిష్ పాల్గొన్నారు.

### కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

ఇచ్చోడ: మండలంలోని ఎల్లమ్మగూడ అటవీ ప్రాంతంలో అక్రమంగా దాచి ఉంచిన కలపను సోమవారం పట్టుకున్నట్లు ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కలపను స్వాధీనం చేసుకుని సిరిచెల్మ ఫారెస్ట్ క్వాటర్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. గుండాల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కలపను దాచిపెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. తనిఖీలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కవిత, బీట్ అధికారులు సజన్‌లాల్, శ్యాంసుందర్, సుభాష్, సచిన్, స్వాతి, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

### యోగా పోటీల్లో ప్రతిభ



బంగారు పతకం అందుకుంటున్న శర్నిక

కుంటాల: కరీంనగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి యోగా గంగోత్రి పోటీలలో కుంటాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శర్నిక, జశ్వంత్ బంగారు పతకం, బోనగిరి రుద్రవేద్, అశృత, హన్విక, అశ్విని, కావేరి వెండి పతకాలు సాధించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగు, జనరల్ సెక్రెటరీ ప్రదీప్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి మధుల్కర్ సుమిత్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేశారు. సదరు విద్యార్థులను పంచాయతీ కార్యదర్శి రాజబాపు, యోగా శిక్షకులు మురళి, మౌనిక, తదితరులు అభినందించారు.

# అటు నుంచి ఇటు.. వలస

- మంచిర్యాల జిల్లాకు వస్తున్న పొరుగు కూలీలు
- మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా నుంచి రాక..
- పత్తి సేకరణతో ఇంటిల్లిపాదికి ఉపాధి



సేకరించిన పత్తితో ట్రాక్టర్‌పై వెళ్తున్న రాజస్థాన్ కూలీలు

నెన్నెల(బెల్లంపల్లి): ఒకప్పుడు మంచిర్యాల జిల్లాలో ఉపాధి లేక.. రైతులు, రైతు కూలీలు పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు అనేక రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సాగునీరు అందుబాటులోకి వచ్చింది. సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో కూలీలకు పని దొరుకుతోంది. దీంతో వలసలు చాలా వరకు తగ్గాయి. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు బతుకుదెరువు కోసం జిల్లాకు వలస వస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ కూలీల కొరత నెలకొన్న నేపథ్యంలో చాలామంది వలస కూలీలకు ఉపాధి దొరుకుతోంది. దీంతో పొరుగున ఉన్న మహారాష్ట్రతోపాటు, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల నుంచి రెండేళ్లుగా కూలీలు పెద్ద ఎత్తున జిల్లాకు వలస వస్తున్నారు. పిల్లా పాపలతో ముల్లె మూట సర్దుకుని వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి జిల్లాకు చేరుతున్నారు. నెన్నెల, బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, తాండూర్, కాసిపేట మండలాల్లోని వివిధ గ్రామాల్లో కూలీ పనులకు వెళ్తున్నారు. వరినాట్లు, పత్తి ఏరే పనులకు ఇంటిల్లిపాదీ వెళ్తున్నారు. గ్రామాల శివారులో డేరాలు వేసుకుని నివాసం ఉంటున్నారు.

**మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా నుంచి..**

పత్తి ఏరేందుకు వలస కూలీలు మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల నుంచి బెల్లంపల్లి నియోజకవర్గానికి సుమారు 10 వేల మందికిపైగా కూలీలు వలస వచ్చారు. పిల్లాపాపలతో ఉదయం 6 గంటలకు పత్తి చేలకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు తిరిగి వస్తున్నారు. తమ గ్రామాల్లో పనులు లేక వలస వస్తున్నామని నెల రోజులు ఇక్కడ పనులు చేసిన తర్వాత తమ ప్రాంతాలకు తిరిగి వెళ్తామని కూలీలు పేర్కొంటున్నారు.



పత్తి ఏరుతున్న హర్యానా కూలీలు

**తినేందుకు తిండి లేక..**

వలస కూలీలు నిరుపేదలు కావడంతో వీరికి తినేందుకు తిండి కూడా ఉండదు. ఏ పూటకు ఆ పూటే పనులు వెతుక్కుంటున్నారు. రెక్కాడితేనే ఆరోజు డొక్క నిండుతుంది. తల్లిదండ్రుల వెంట పిల్లలు కూడా పనికి వెళ్తున్నారు. పొద్దంతా కష్టపడితే రూ.400 నుంచి రూ.500 వరకు వస్తున్నాయని సీజన్ ముగిసే వరకు ఒక్కొక్కరు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు సంపాదిస్తామని కూలీలు పేర్కొంటున్నారు. మరోవైపు వలస కూలీల రాకతో జిల్లాలో కూలీల కొరత తీరిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ఏటా వస్తున్నాం



నాలుగేళ్ల నుంచి పత్తి ఏరేందుకు వస్తున్నాం. మా దగ్గర పనులు దొరకవు. పోయిన ఏడాది వచ్చి రూ.30 వేలు సంపాదించిన. రైతులు మమ్మల్ని ట్రాక్టర్‌లో చేలకు తీసుకుపోయి తీసుకస్తరు. మా తోటివాళ్లు మంచిగా పత్తి ఏరి రూ.40 వేలు కూడా సంపాదిస్తున్నారు.

– కౌసల్యాబాయి, వలస కూలీ (మహారాష్ట్ర)

### కూలి గిట్టుబాటు అవుతోంది



మా ఊళ్లో పంటలు లేవు, పనులు దొరకవు. అందుకే పత్తి ఏరేందుకు వచ్చాం. నెల రోజులు ఇక్కడే ఉంటాం. రోజుకు రూ.600 వరకు గిట్టుబాటు అవుతుంది. పనులు అయిపోగానే వెళ్లిపోతాం. మా దగ్గర ఏవైనా చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం గడుపుతాం.

– సోహెల్, వలస కూలీ (రాజస్థాన్)

### మా దగ్గర పని దొరకదు



మా రాష్ట్రంలో పంటలు సరిగా పండవు. అందుకే మేమంతా పిల్లాపాపలతో పత్తి ఏరేందుకు వచ్చాం. మా రాష్ట్రంలో పొద్దంతా పని చేసినా రూ.200 రావు. ఇక్కడ రోజుకు రూ.600 నుంచి రూ.800 వరకు వస్తున్నాయి. మా కుటుంబం అంతా కలిసి పత్తి ఏరుతున్నాం.

– రషీద్, వలస కూలీ (హర్యానా)

### పనులు దొరకక వచ్చాం



మా ఏరియాలో పనులు దొరకక ఇక్కడికి వచ్చాం. కూలీపై ఆధారపడి మేమంతా బతుకుతున్నాం. పొద్దటి నుంచి సాయంత్రం వరకు 80 కిలోల పత్తి ఏరుతా. కిలోకు రూ.10 చొప్పున రూ.800 వరకు వస్తాయి. కూలీ బాగానే ఉంది. చేతినిండా పని ఉంది.

– శోభ, వలస కూలీ (మహారాష్ట్ర)

### 'బలవంతపు మతమార్పిడిని ఉపేక్షించం'



మతప్రచారాన్ని అడ్డుకుంటున్న సభ్యులు

జన్నారం: బలవంతపు మతమార్పిడికి పాల్పడితే ఊరుకునేది లేదని హిందూవాహిని, ధర్మజాగరణ జిల్లా ప్రముఖ్ కొండగొర్ల శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పొనకల్, జన్నారం గ్రామాల పరిధిలో కొందరు మతప్రచారం చేస్తుండగా అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మత ప్రచారం చేయడం సరికాదన్నారు. బలవంతపు మతమార్పిడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ధర్మజాగరణ, హిందూవాహిని నాయకులు నల్లపు కృష్ణ, శ్రీధర్, అరవింద్, తదితరులు ఉన్నారు.

### ఆలయంలో చోరీకి యత్నం

కుభీర్: మండలంలోని పార్డి(బి) రాజరాజేశ్వర ఆలయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆలయంలో ప్రవేశించి హుండీని పగులగొట్టే ప్రయత్నం చేశారు. శబ్దం విన్న గ్రామస్తులు కేకలు వేయగా కారులో భైంసావైపు పారిపోవడంతో 100కు సమాచారం ఇచ్చారు. గుండెగాం వద్ద కారు టైరు పేలిపోయి కల్వర్టును ఢీకొట్టి ఆగిపోవడంతో పోలీసులు వచ్చి కుభీర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. చోండిలోని దత్తాసాయి మందిరంలో చోరీకి యత్నించి సిలిండర్‌ను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

## అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

జన్నారం: మండలంలోని చింతగూడ సమీపంలో ఆదివారం రాత్రి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన పలువురు యువకులు కారులో జన్నారం నుంచి మంచిర్యాలకు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటనలో వాహనంలోని ఇంజిన్ ఎగిరిపడింది. ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో చిన్నచిన్న గాయాలతో యువకులు బయటపడినట్లు తెలిసింది. ఘటనపై ఎస్సై రాజవర్ధన్‌ను సంప్రదించగా ప్రమాదం జరిగిన మాట వాస్తవమే కానీ ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

**తప్పిన పెను ప్రమాదం**

సారంగపూర్: మండలంలోని ధని గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటన సమయంలో కారులో డ్రైవర్ విష్ణువర్ధన్ ఒక్కడే ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అతివేగం కారణంగానే కారు అదుపుతప్పినట్లు ఆయన వెల్లడించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నుజ్జునుజ్జయిన వాహనం

## జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం

నస్పూర్: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన కొయ్యల శ్రీనివాస్ (43) సెంట్రిగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందిన సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకు లుంగీతో ఉరేసుకున్నాడు. మృతుని చిన్న కుమారుడు మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి వేలాడుతూ కనిపించాడు. స్థానికులను పిలవడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.



కొయ్యల శ్రీనివాస్ (ఫైల్)

### యువకుడిపై గొడ్డలితో దాడి

కుభీర్: మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన బొయిడి విజయ్‌పై గుర్తు తెలియని వ్యక్తి గొడ్డలితో దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. విజయ్ ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన మరోవ్యక్తితో కలిసి మద్యం సేవించడానికి కస్రా గ్రామానికి వెళ్లాడు. వెంట ఉన్న వ్యక్తి విజయ్‌ని కస్రాలో దించి కుభీర్‌కు వెళ్లాడు. మద్యం సేవించిన విజయ్ నడుచుకుంటూ గ్రామానికి వెళ్తుండగా వర్ని ఎక్స్‌రోడ్ వద్ద వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి గొడ్డలితో దాడిచేసి పారిపోయాడు. కుభీర్ వెళ్లిన వ్యక్తి వచ్చిచూడగా రక్తపుమడుగులో పడి ఉండడంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చికిత్స నిమిత్తం ముందుగా భైంసాకు, అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడు కోమాలో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై పీ.రవీందర్‌ను వివరణ కోరగా ఇంకా కేసు నమోదు చేయలేదన్నారు.

### మృతదేహం లభ్యం

తిర్యాణి: మండలంలోని సుంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దానపూర్ అటవీ ప్రాంతంలో ఒకరి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపారు. గత నవంబర్‌లో దానపూర్ గ్రామానికి చెందిన ఆత్రం రాజు వరుసకు అత్తమ్మ అయిన మారుబాయిపై హత్యాయత్నం చేసి విఫలం కావడంతో అటవీ ప్రాంతంలోకి పారిపోయాడు. ఆదివారం అడవిలోకి వెళ్లిన మేకల కాపరి టెకం రాజుకు అస్థిపంజరం, పక్కనే లుంగీ, స్వెటర్ కనిపించడంతో అనుమానం వచ్చి మృతుని తల్లి గంగుబాయికి సమాచారం అందించగా ఆమె అక్కడి చేరుకోని రాజు మృతదేహంగా గుర్తించింది. సోమవారం మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### మాణిక్‌గూడ పరిసరాల్లో చిరుత సంచారం

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం మాణిక్‌గూడ పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ వెల్లడించారు. సోమవారం అటవీశాఖ అధికారులు గ్రామ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో చిరుత పులి పాదముద్రలు గుర్తించినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం అడవిలోకి వెళ్లొద్దన్నారు. పత్తి తీసే రైతులు శబ్దాలు చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రాజేశ్, యానిమల్ ట్రాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన యువకులు

బెల్లంపల్లి: పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియా రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఏఎంసీ ఏరియా నుంచి ద్విచక్ర వాహనంపై మంచిర్యాల వైపు వెళ్తున్న ఇద్దరు యువకులు ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టారు. ఘటనలో తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన వంశీ, సాయి కిరణ్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆటో

నర్సాపూర్(జి): ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై సాయి కిరణ్ తెలిపారు. లోకేశ్వరం మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన లావుడ్యా సూర్య, లావుడ్యా అరుణ్ సోమవారం ద్విచక్ర వాహనంపై నిర్మల్ వైపు వెళ్తుండగా నర్సాపూర్ (జి) బస్టాప్ వద్ద బామ్ని (బి) గ్రామానికి చెందిన కదం సంతోష్ ఆటో నడుపుకుంటూ వచ్చి ఢీ కొట్టాడు. ఘటనలో సూర్య, అరుణ్‌కు గాయాలు కావడంతో 108లో భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అరుణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### సెమీ ఫైనల్‌లో ఓడిన జిల్లా జట్టు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లో అండర్ –14 విభాగంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు సోమవారం జరిగిన సెమీ ఫైనల్‌లో ఓటమి చెందినట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు. సెమీఫైనల్‌లో సెయింట్ ఆండ్రోస్‌తో తలపడగా ఆ జట్టు 164 స్కోర్ సాధించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు 125 పరుగులకే ఆలౌట్ అయ్యి ఓటమి చెందిందని ఆయన పేర్కొన్నారు.

### బాలిక అనుమానాస్పద మృతి



హరిత మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగాపూర్‌లో అనుమానాస్పదంగా బాలిక మృతి చెందినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. గ్రామానికి చెందిన సీలం ఎల్లన్న, అంకవ్వ దంపతుల చిన్నకూతురు హరిత (12) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరోతరగతి చదువుతోంది. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లకుండా చేనుకు కాపలాగా వెళ్లింది. ఇదే తరుణంలో కిందపడి పోయి మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పత్తి ధరను తగ్గించిన సీసీఐ

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో సీసీఐ పత్తి ధరను తగ్గించింది. ఇది వరకు క్వింటాలుకు మద్దతు ధర రూ.7,521 ఉండగా రూ.7,471కి తగ్గించారు. బీబీ స్పెషల్ మోడ్ రకం పత్తి వస్తోందని, అందుకే పత్తి ధరను తగ్గితస్తున్నట్లు సీసీఐ అధికారులు పేర్కొన్నారని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు.

### ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

రామకృష్ణాపూర్: పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో సోమవారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక గీతాలాపనలు అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రేమ, కరుణ, దయాగుణం కలిగిన ఏసుక్రీస్తు బోధనలు అందరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కాంగ్రెస్ నాయకులు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పల్లె రాజు, సీఎస్ఐ పాస్టర్ జాషువా, సెక్రెటరీ డొల్కల డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా వాలీబాల్ ఎంపిక పోటీలు



ఉమ్మడి జిల్లా బాలికల జట్లతో నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ జట్టు సీఎం కప్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి 96 మంది బాలబాలికలు పాల్గొనగా 12 మంది బాలురు, 12 మంది బాలికలు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి ఖమ్మంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, డీవైఎస్‌వో రాజ్‌వీర్, అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, కోశాధికారి గాజుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. వంతెన నిర్మించాలని గాదిగూడ మండలం మారుగూడ గ్రామస్తులు, విద్యుత్ బోర్ మంజూరు చేయించాలని సిర్పూర్(టి)మండలం భూపాలపాలెం గ్రామానికి చెందిన సిడాం వెంకట్, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని సిర్పూర్(యూ) మండలం షెట్టిహడప్‌నూర్ గ్రామానికి చెందిన వెద్మ చిన్ను కోరారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

## చపాతీ కర్రీలో స్టీల్ స్క్రబ్బర్ ముక్క


- మంచిర్యాలలోని ఓ హోటల్‌లో ఘటన

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ఓ హోటల్‌లో ఈ నెల 22న రాత్రి ఓ వినియోగదారుడు టిఫిన్ చేసేందుకు వెళ్లి చపాతీ ఆర్డర్ చేశాడు. చపాతీతో పాటు హోటల్ సర్వర్ తీసుకొచ్చిన కర్రీలో స్క్రబ్బర్ ముక్క కనిపించడంతో నిర్వాహకులను నిలదీశాడు. అది స్టీల్ స్క్రబ్బర్ ముక్క అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ హోటల్‌లో వరుస ఆహార కల్తీ పదార్థాలు జరిగిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల ఓ వినియోగదారుడు ఉప్మా పార్సిల్ ఆర్డర్ చేశాడు. ఇంటికి వెళ్లి చూసేసరికి అందులో చనిపోయిన ఎలుక లభించింది. గతంలో వెజ్ బిర్యానీలో బొద్దింక లభించిన ఘటనలూ ఉన్నాయి. నిబంధనల ప్రకారం ప్రతీ హోటల్‌లో సంబంధిత శాఖ అధికారుల ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయల్సి ఉండగా నిర్వాహకులు తుంగలో తొక్కేస్తున్నారు. ఈ విషయమై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు, హోటల్ యజమానిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించక పోవడం గమనార్హం.



కర్రీలో వచ్చిన స్టీల్ స్క్రబ్బర్ ముక్క

## ఘనంగా సింగరేణి డే వేడుకలు



పర్యావరణ విభాగం ఏర్పాటు చేసిన స్టాల్



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: సింగరేణి ఆవిర్భావ వేడుకలను సోమవారం మందమర్రి ఏరియాలో ఘనంగా నిర్వహించారు. జీఎం కార్యాలయం వద్ద, సింగరేణి హైస్కూల్ మైదానంలో జీఎం దేవేందర్ సింగరేణి జెండాను ఎగురవేశారు. మైదానం ఆవరణలో ఏర్పాటు చేసిన పలు విభాగాల స్టాల్స్‌ను సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి ప్రారంభించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం సింగరేణి స్థితిగతులను వివరించారు. 135 సంవత్సరాల చరిత్రలో సింగరేణి ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొందని అన్నారు. దేశవ్యాప్తంగా వ్యాపార రంగంలో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తూ పోటీ రంగంలో సింగరేణి ముందు వరుసలో ఉందన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr.J S అకాడమి ( ISO 9001: 2015 సర్టిఫైడ్ ). ఫోన్: 8866977112 [HA-15347]

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [H-783410]

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256014]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462